**299వ అధ్యాయం**

# ٢٩٩ ـ بَابُ كَرَاهَةِ الْمَشْيِ فِي نَعْلٍ وَاحِدَةٍ، أَوْ خفٍّ وَاحِدٍ لِغَيْرِ عُذْرٍ، وَكَرَاهَةِ لُبْسِ النَّعْلِ وَالْخُفِّ قَائِماً لِغَيْرِ عُذرٍ

# కారణమేదీ లేకుండా ఒకే బూటు లేక ఒకే మేజోడు తొడుక్కొని నడవటం, బూట్లు మరియు మేజోళ్లు నించొని తొడుక్కోవటం అవాంఛనీయం

١٦٥١ ـ عَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللهُ عَنْـهُ أَنَّ رَسُـولَ اللهِ ﷺ قَـالَ: «لَا يَمْـشِ أَحَدُكُمْ في نَعْلٍ وَاحِدَةٍ، لِيَنْعَلْهُمَا جَمِيعاً، أَوْ لِيَخْلَعْهُمَـا جَمِيعـاً». وفـي روايـةٍ «أَوْ لِيُحْفِهِمَا جَمِيعاً» متفقٌ عَلَيْهِ.

1651. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రబోధించారు: మీలో ఎవరూ కూడా ఒకే బూటుతో నడవరాదు. తొడుక్కుంటే రెండూ తొడుక్కోవాలి. వదిలితే రెండూ వదలాలి. (బుఖారీ-ముస్లిం)

వేరొక ఉల్లేఖనంలో "రెండు కాళ్లూ బూట్లు లేకుండా ఉంచాలి" అని ఉంది. (బుఖారీ-ముస్లిం)

*(సహీహ్ బుఖారీలోని లిబాస్ ప్రకరణం - సహీహ్ ముస్లింలోని లిబాస్, జీనత్ ప్రకరణం)*

## ముఖ్యాంశాలు

ఒంటి కాలి చెప్పుతో నడవటం ఏ విధంగానూ సంస్కారం అనిపించుకోదు. ఆ విధంగా నడిచేవారిని చూసి జనం నవ్వుతారు. అదీగాక ఆ విధంగా నడవటమనేది మనిషి స్థాయికి, అతని హుందాతనానికి విరుద్ధమైన విషయం. ఇంకో విషయం ఏమిటంటే ఈ విధంగా నడవటం ఇబ్బందికరంగా కూడా ఉంటుంది. మనిషి ఒంటికాలికి చెప్పు తొడుక్కొని సరిగ్గా నడవలేడు. అందుకే తొడుక్కుంటే రెండు చెప్పులూ తొడుక్కొని నడవాలి. లేదా రెండు చెప్పులూ విడిచి నడవాలి. పోతే కాళ్ళకు చెప్పులు లేకుండా నడిచే విషయంలో షరీఅత్ పరమైన ఆంక్షలు ఏమీ లేకపోయినప్పటికీ సమాజం దృష్టిలో మాత్రం అది అవాంఛనీయం.

١٦٥٢ ـ وَعَنْهُ قَالَ: سَمِعْتُ رَسُولَ اللهِ ﷺ يَقُولُ: «إِذَا انْقَطَعَ شِسْعُ نَعْلِ أَحَدِكُمْ، فَلاَ يَمْشِ فِي الأُخْرَى حَتَّى يُصْلِحَهَا» رواهُ مسلم.

1652. దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రబోధిస్తుండగా తాను విన్నానని హజ్రత్ అబూ హురైరా (రజి) గారే తెలియజేశారు: మీలో ఎవరి చెప్పు కొస అయినా తెగిపోతే వారు దాన్ని బాగు చేయించుకోనంతవరకూ రెండో చెప్పు తొడుక్కొని నడవరాదు. (ముస్లిం)

*(సహీహ్ ముస్లింలోని లిబాస్, జీనత్ ప్రకరణం)*

١٦٥٣ ـ وَعَنْ جَابِرٍ رَضِيَ اللهُ عَنْهُ أَنَّ رَسُولَ اللهِ ﷺ نَهَى أَنْ يَنْتَعِلَ الرَّجُلُ قَائِماً. رَوَاهُ أَبُو دَاوُدَ بِإِسْنَادٍ حَسَنٍ.

1653. హజ్రత్ జాబిర్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లం) బూట్లు నించొని తొడుక్కోవటాన్ని వారించారు. (అబూ దావూద్ దీనిని ప్రామాణికమైన ఆధారంతో వెలికితీశారు.)

*(సుననె అబూదావూద్‌లోని లిబాస్ ప్రకరణం)*

## ముఖ్యాంశాలు

బూట్లు కూర్చొని తొడుక్కోవాలని ఈ హదీసు ద్వారా బోధపడుతోంది. కొంతమంది పండితులు పై హదీసులోని వారింపును 'తన్‌జీహ్'గా పేర్కొన్నారు. అంటే నించొని తొడుక్కోవటం ఏమంత తీవ్రమైన విషయం కాదుగాని కూర్చొని తొడుక్కోవటం మంచిదని దాని భావం. ఈ అధ్యాయంలో బూట్లు తొడుక్కునే సంస్కారాన్ని వివరించి ఇస్లామీయ ప్రబోధనలు జీవితపు అన్ని రంగాలనూ తమలో ఇమిడ్చుకొని ఉన్నాయనే విషయాన్ని స్పష్టం చేయటం జరిగింది.